## 25లోగా డిగ్రీ ఫీజు చెల్లించాలి

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 : టీయూ పరిధిలోని నిర్వహించే డిగ్రీ (2వ 4వ, 6వ సెమిస్టర్) రెగ్యులర్ కోర్సులకు సంబంధించిన పరీక్ష ఫీజును ఈ నెల 25లోగా చెల్లించాలని పరీక్షల నియంత్రణాధికారిని ఆచార్య అరుణ సూచించారు. వంద రూపాయల అపరాద రుసుముతో 26వ తేదీవరకు, రూ. 500లతో 27 వరకు రూ. వెయ్యితో 29 వరకు, రూ. 2వేల అపరాద రుసుముతో 30వ తేదీవరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు.

## కొనుగోలు కేంద్రం తనిఖీ

ఇందల్వాయి, ఏప్రిల్ 16 : మండలంలోని సిర్నాపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో సాయాగౌడ్, మార్కెటింగ్ డీపీఎం సాయిలు మంగళవారం తనిఖీ చేశారు. ఇప్పటి వరకు సేకరించిన వడ్లు, గన్నీ బ్యాగుల స్టాక్, రవాణా ఏర్పాట్లతోపాటు ఆన్‌లైన్‌లో పొందుపర్చిన వివరాలను తెలుసుకున్నారు.

## నేడు, రేపు మెగా హెల్త్ క్యాంప్

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని సీఎంసీ భవనంలో నేడు, రేపు (బుధ, గురువారం) మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకుడు శ్యాంసన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎస్ఐ మెదక్ డయాసిస్ సహకారంతో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రక్త, దంత, కంటి పరీక్షలులతోపాటు బీపీ, షుగర్, ఎక్స్‌రే తదితర టెస్టులు చేస్తామని, ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## 20 నుంచి సంగీత శిక్షణ

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16: డీకే మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో వెసవి సంగీత శిక్షణ తరగతులను ఏప్రిల్ 20 నుంచి మే 31 వరకు నిర్వహించనున్నట్లు ప్రముఖ మ్యూజిక్ టీచర్ దినేశ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కర్ణాటక సంగీతంతోపాటు కీబోర్డు, గిటార్ కాంగో, ప్యాడ్స్, డ్రమ్స్ తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు నగరంలోని గంగాస్థాన్ పేస్ –2, రోడ్ నం. 5, సుదర్శన్‌రావు అపార్ట్‌మెంట్‌లో లేదా 9440023331 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నిందితులకు జైలు

వినాయక్‌నగర్, ఏప్రిల్ 16: నగరంలోని మూడో ఠాణా పరిధిలో నమోదైన పలు కేసుల్లో నిందితులను మార్నింగ్ కోర్టులో మంగళవారం హాజరుపర్చగా జైలు శిక్ష విధించారు. పేకాటరాయుళ్లతోపాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి జడ్జి రెండురోజుల జైలు శిక్ష విధించారని ఎస్సై ప్రవీణ్ కుమర్ తెలిపారు.

## కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్సీ

కంఠేశ్వర్, ఏప్రిల్16: మాజీ ఎమ్మెల్సీ డీ రాజేశ్వర్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. ఆయకు సీఎం రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

# కాంగ్రెస్‌వి దొంగ హామీలు

- మాయమాటలతో ఓట్లు వేయించుకున్నారు
- గ్యారెంటీలు అంటూ నమ్మించారు.. ఇప్పుడు బొంకుతున్నారు
- వారిపై ప్రజలకు విశ్వాసం పోయింది
- ఎంపీ ధర్మపురి అర్వింద్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అర్వింద్

వినాయక్‌నగర్, ఏప్రిల్ 16: కాంగ్రెస్ ఒక దొంగ పార్టీ అని, మాయమాటలు, దొంగ వాగ్దనాలు చేసి అధికారంలోకి వచ్చిందని ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అంటూ నమ్మించి.. ఇప్పుడు పంద్రాగస్టు వరకు అమలు చేస్తామని బొంకుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలకు విశ్వాసం పోయిందని అన్నారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు సాధ్యం కాని హామీలిచ్చి, ప్రజలతో ఓట్లు వేయించుకున్నాక రోజుకో కథ చెబుతున్నారని మండిపడ్డారు. వాళ్ల ఫస్ట్ టార్గెట్ రూ. వెయ్యి కోట్లు జమ చేసుకోవడమేనని ఆరోపించారు. డిసెంబర్ 9న ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్.. వరికి రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పి మోసం చేశారని అన్నారు. జిల్లాలోని చెరుకు ఫ్యాక్టరీలను వెంటనే తెరిపిస్తామని.. నేడు కమిటీలు వేసి ఎక్కడో పోయి కూర్చున్నారనని ధ్వజమెత్తారు. ఫ్యాక్టరీలను 2025 డిసెంబర్ నాటికి తెరుస్తామంటున్నారని ఆగ్రహంవ్యక్తం చేశారు. ఇలా రోజుకో మాట చెప్పే కాంగ్రెస్‌పై ఏమాత్రం విశ్వసనీయత లేదన్నారు. బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను వివరిస్తూ యూనిఫాం సివిల్ కోడ్ ద్వారానే మహిళలకు రక్షణ ఉంటుందని అన్నారు. సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, నాయకులు పాల్గొన్నారు.

## గోసేవలో డీఈవో


ఆవులకు గడ్డి తినిపిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 16: నగరంలోని బడా రామ్‌మందిర్‌ను డీఈవో దుర్గాప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గోసేవ చేసుకున్నారు. అంతకుముందు బర్కత్‌పుర కాలనీలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేశారు. ఆయన వెంట హెచ్‌ఎం కృపాల్ సింగ్ ఉన్నారు.

## రామాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఇందల్వాయి, ఏప్రిల్ 16 : మండలకేంద్రంలోని చారిత్రక సీతారామచంద్ర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా మొదటిరోజు ప్రధాన అర్చకుడు కందాళై రాజగోపాలాచారి ఆధ్వర్యంలో విశేష పూజలతోపాటు ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు దీపక్, దీక్షిత్, వీడీసీ చైర్మన్ కుమ్మరి మోహన్, సభ్యులు జనార్దన్, చాకలి గంగారాం, చిన్నగంగారాం, సాగర్, మాజీ సర్పంచ్ మల్లయ్య, మాజీ ఎంపీటీసీ గంగాధర్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

## ఎల్లమ్మకు బోనాలు


బోనాలతో ఎల్లమ్మ ఆలయానికి వెళ్తున్న గౌడ కుటుంబాలు

సిరికొండ, ఏప్రిల్ 16 : మండలకేంద్రంలోని రేణుకా ఎల్లమ్మకు గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం బోనాలు సమర్పించారు. గౌడ కుటుంబాలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు హన్మాగౌడ్, కోశాధికారి రాజేందర్‌గౌడ్, సభ్యులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో బీసీ గళం వినిపించాలి


మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 16: స్వాతంత్ర్య వచ్చి 77 ఏండ్లు గడుస్తున్నా బీసీలకు సరైన ప్రాధాన్యం, నిధుల్లో వాటా దక్కడంలేదని బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా 70 కోట్ల జనాభా ఉన్నప్పటికీ వారి అభ్యున్నతి కోసం ప్రత్యేక మంత్రిత్వ శాఖ లేకపోవడం బాధాకరమని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుస్సా ఆంజనేయులు మాట్లాడుతూ.. బీసీ కుల గణన చేపట్టి దామాషా ప్రకారం హక్కులు కల్పించాలని, సబ్ ప్లాన్ ద్వారా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ప్రసాద్, దేవేందర్, శంకర్, శ్రీలత, గురు చరణ్, స్వామి, బస్వరాజు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## సమాజాన్ని చైతన్యపరిచేదే నాటకం


కందుకూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుమారశర్మ తదితరులు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16: నిద్రపోతున్న జాతిని మేల్కొలిపే కళనే నాటకమని, నాటికలను నిరంతరాయంగా ప్రదర్శించినప్పుడే సామాజిక చైతన్యం సజీవంగా ఉంటుందని ప్రముఖ రంగస్థల కళాకారుడు శ్రీపాద కుమారశర్మ అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా తెలుగు నాటక రంగ దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని తన్మయి ఆర్ట్స్ థియేటర్ మాతృసంస్థలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కుమారశర్మ హాజరై ఉమ్మడి జిల్లాలో నాటకరంగ ప్రాముఖ్యతను వివరించారు. ముందుగా కందుకూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్నేహమయి ప్రకాశ్, గంగాధర్, సుదర్శన్, పోశెట్టి, లింగవర్ధన్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

## ఈవీఎంల భద్రత ఏర్పాట్ల పరిశీలన

డిచ్‌పల్లి, ఏప్రిల్ 16 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎంలను భద్రపర్చేందుకు ఆర్డీవో రాజేంద్రకుమార్ మంగళవారం స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించారు. మండల పరిషత్ కార్యాలయంలోని పైఅంతస్తు గదిలో ఈవీఎంలను భద్రపర్చేందుకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్ ప్రభాకర్‌కు సూచించారు.

## వర్ని తహసీల్దార్‌గా శ్రావణ్ కుమార్



వర్ని, ఏప్రిల్ 16: వర్ని తహసీల్దార్‌గా శ్రావణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన మోతీసింగ్ నిధులను దుర్వినియోగం చేయడంతో అధికారులు సస్పెండ్ చేశారు. ఆయన స్థానంలో బోధన్ ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న శ్రావణ్ కుమార్‌కు తహసీల్దార్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు.

## 23న హనుమాన్ జయంతి వేడుకలు

సుభాష్‌నగర్, ఏప్రిల్ 16: నగరంలోని గోల్‌హనుమాన్ మందిరంలో ఈ నెల 23న హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఈవో జి.వేణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 4.30 గంటలకు స్వామి వారికి అభిషేకం, సిందూర పూజ, 5.45కు జయంతి వేడుకలు, డోలారోహణం, 7 గంటలకు మంత్ర పుష్పం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తుల కోసం మహా అన్నదానం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

ధర్పల్లి, ఏప్రిల్ 16 : ఉపాధి హామీ పనులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. మండలంలోని కేశారం గ్రామంలో పనులకు హాజరయ్యే కూలీల సంఖ్య తగ్గడంతో మంగళవారం గ్రామసభ ఏర్పాటుచేసి అవగాహన కల్పించారు. ప్రతిరోజూ కనీసం వందమంది హాజరయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏవో ప్రవీణ్, టీఏ, ఎఫ్ఏలు ఉన్నారు.


కేశారం గ్రామస్తులకు ఉపాధి పనులపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో బాలకృష్ణ

## వ్యాన్ ఢీకొని ఒకరు మృతి

వినాయక్‌నగర్, ఏప్రిల్ 16: నిజామాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. ఎస్సై మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మన్‌నపల్లి గ్రామానికి చెందిన దిలారి రవి, దిలారి ప్రభాకర్, రాజు బైక్‌పై వెళ్తుండగా జన్నేపల్లి వద్ద బియ్యం లోడ్‌తో ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రభాకర్(33) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## చేపల వేటకు వెళ్లి మరొకరు..

ఇందల్వాయి, ఏప్రిల్ 16 : చేపలవేటకు వెళ్లిన ఓ యువకుడు మృత్యువాత పడ్డాడు. ఇందల్వాయికి చెందిన శ్రీకాంత్ (37) స్థానిక పెద్దచెరువు కింద పెద్ద కచ్చు కాలువలో మంగళవారం ఉదయం చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల వల ఆయన కాళ్లకు చుట్టుకొని నీట మునిగి మృతిచెందాడు. మృతుడి అన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై మనోజ్‌కుమార్ తెలిపారు.

# బాల్య వివాహం అడ్డగింత

### బాలిక కుటుంబ సభ్యులకు అధికారుల కౌన్సిలింగ్

రెంజల్, ఏప్రిల్ 16: మండలంలోని కునేపల్లి గ్రామంలో ఓ బాల్య వివాహాన్ని అధికారులు అడ్డుకొన్నారు. అనంతరం బాలిక కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. నాందేడ్ జిల్లా ఉమర్‌ఖేడ్ తాలూకా డాంకీ గ్రామానికి చెందిన కృష్ణ (24)తో కునేపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక(16)తో ఈనెల 24న పెండ్లి చేయాలని కుటుంబ సభ్యులు నిశ్చయించారు. ఈ విషయం చైల్డ్ లేబర్ టీం సభ్యులకు తెలియడంతో వారు గ్రామానికి చేరుకొని పెండ్లి ఏర్పాట్లను నిలిపివేయించారు. బాలిక కుటుంబీకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలతో జరిగే అనర్థాలను వివరించారు. 18 ఏండ్లు నిండే వరకు పెండ్లి చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఐసీపీఎస్ టీం సభ్యురాలు జమ్రు, చైల్డ్‌లేబర్ టీం సభ్యుడు ముజాహిత్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణి, కార్యదర్శి కృష్ణ, అంగన్‌వాడీ టీచర్ రాధ, రెంజల్ పోలీసులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 16: పట్టణ పరిధిలోని మామిడిపల్లిలో మారుతి (32) అనే వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని నాగబాబుకు చెందిన గ్యారెజీ( వాహన మెకానిక్) లో మారుతి పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి మారుతి భోజనం తీసుకొని తాను పనిచేస్తున్న గ్యారేజీకి వెళ్లాడు. మంగళవారం ఉదయం తోటి డ్రైవర్లు డ్యూటీకీ వెళ్లడానికి మారుతి ఉంటున్న గ్యారెజ్‌కు వెళ్లగా మృతి చెంది ఉన్నాడు. విషయం తెలుసుకున్న యజమాని నాగబాబు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో రవికుమార్ తెలిపారు.

## ఢీకంపల్లిలో పశువులకు టీకాలు


పశువులకు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న వైద్యులు

మాక్లూర్, ఏప్రిల్ 16 : మండలంలోని ఢీకంపల్లి గ్రామంలో 568 పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి ఉమామహేశ్వర్ తెలిపారు.కార్యక్రమంలో వీఎల్‌వో వినిత, వీఏ అహ్మద్ పాషా, గోపాలమిత్ర సుధీర్, జైల్‌సింగ్, శ్రీను, గంగాధర్, పుష్ప, లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

## 20న బోధన్‌లో 'కవి సమ్మేళనం'

బోధన్, ఏప్రిల్ 16: బోధన్ పట్టణంలో ఈ నెల 20న పంప సాహితీ పీఠం ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు సాహితీ పీఠం అధ్యక్షుడు పురాణే అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పబ్బ మురళి ఒక ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ వెనుక ఉషోదయ జూనియర్ కళాశాలలో సాయంత్రం 4 గంటలకు కవి సమ్మేళనం నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్రోధి నామసంవత్సరం ఉగాది సందర్భంగా నిర్వహించే ఈ కవి సమ్మేళనాన్ని కవులు, రచయితలు, సాహితీ అభిమానులు విజయవంతం చేయాలని వారు కోరారు. సమ్మేళనంలో 18 పంక్తులకు మించని కవితలను చదివే అవకాశాన్ని అందరికీ కల్పించనున్నట్లు తెలిపారు.

# అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వినాయక్‌నగర్, ఏప్రిల్ 16: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా జిల్లాలో అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మంగళవారం నగరంలోని కంఠేశ్వర్ పరిధిలోని అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫైర్ డ్రిల్, ఫస్ట్ ఎయిడ్, చిన్నపాటి అగ్నిప్రమాదం జరిగినప్పుడు సీస్ ఫైర్ సహాయంతో మంటలను అదుపు చేయడం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై డెమో ద్వారా వివరించారు. ఇంట్లో సిలిండర్ నుంచి మంటలు వ్యాపించిన సమయంలో ఎలాంటి ముందస్తు జాగ్రతలు తీసుకోవాలనే అంశంపై ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అనంతరం అగ్ని ప్రమాదాలు జరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు, లీడింగ్ ఫైర్‌మెన్, ఫైర్‌మెన్, సిబ్బంది పాల్గొన్నారు.


నందిపేటలో ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తూ..

నందిపేట్, ఏప్రిల్ 16 : నందిపేట మండల కేంద్రంలో అగ్నిమాపక శాఖ సిబ్బంది అగ్ని ప్రమాదాల నివారణపై ఉపాధి హామీ కూలీలకు మంగళవారం అవగాహన కల్పించారు. నందిపేట్‌లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్న ప్రదేశానికి వెళ్లి, అగ్నిప్రమాదం జరిగితే నివారించడంపై డెమో ద్వారా కూలీలకు వివరించారు. వారికి సూచనలు, సలహాలు అందజేశారు.

**ఆర్మూర్‌లో..**

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 16: ఆర్మూర్ పట్టణంలోని మెగా అపార్టుమెంట్‌లో అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మధుసూదన్, సిబ్బంది, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

## ప్రతి కూలీకి జాబ్‌కార్డు ఇవ్వాలి

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 16 : ప్రతి ఉపాధిహామీ కూలీకి జాబ్ కార్డు, గుర్తింపు కార్డు ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సారా సురేశ్, రైతు కార్మిక సంఘం జిల్లా కోశాధికారి బి.అశోక్, మండల అధ్యక్షుడు వి.బాలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని హాసాకొత్తూర్‌లో ఉపాధిహామీ పనుల ప్రదేశాన్ని వారు పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేసి, ప్రాథమిక చికిత్స కిట్లను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు.

## 'కృష్ణవేణి'లో గ్రాడ్యుయేషన్ డే

బాల్కొండ, ఏప్రిల్ 16 : మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాలులో మంగళవారం కృష్ణవేణి ఉన్నత పాఠశాల 'గ్రాడ్యుయేషన్ డే' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కృష్ణవేణి విద్యాసంస్థల చైర్మన్ రాజు సంగని ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పట్టుదలతో ఏదైనా సాధించవచ్చన్నారు. అనంతరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే పట్టాలు, మెడల్స్‌లను అందించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు కోటగిరి భానుచందర్, ఆకుల లక్ష్మణ్, ప్రిన్సిపాల్ విజయ్ కర్తన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ఎరాజ్‌పల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

బోధన్ రూరల్, ఏప్రిల్ 16: బోధన్ మండలంలోని ఎరాజ్‌పల్లి గ్రామంలో గంగమ్మ తల్లి ఆలయ ఆవరణలో గంగమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా మంగళవారం బోయి కుల సంఘం ఆధ్వర్యంలో వేద పండితులతో ప్రత్యేక పూజ, హోమం కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. బుధవారం గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఉంటుందని బోయి కుల సంఘం అధ్యక్షుడు సుట్టాకుల సత్యనారాయణ తెలిపారు. చిన్న లక్ష్మణ్, శంకర్, గాలయ్య, సతీశ్, సాయి కుమార్ తదితరులున్నారు.

## అక్రమ కుళాయి కనెక్షన్లను స్వచ్ఛందంగా తొలగించాలి


కందకుర్తిలో అక్రమ కనెక్షన్లను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎంఏ ఖలీం

రెంజల్, ఏప్రిల్ 16: కందకుర్తి గ్రామంలో నీటి కొరత సృష్టించేలా ఏర్పాటు చేసుకున్న అక్రమ కుళాయి కనెక్షన్లను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, ప్రత్యేకాధికారి ఎంఏ ఖలీం హెచ్చరించారు. మంగళవారం ఆయన గ్రామంలో పర్యటించారు.ఇంటి పన్ను బకాయి లేని వారికి తాగునీటి సమస్య తలెత్తకుండా నీరందించాలని కార్యదర్శిని ఆదేశించారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులకు తహసీల్దార్ పలు సూచనలు చేశారు. ఆయన వెంట జీపీ కార్యదర్శి సతీశ్ చంద్ర, కారోబార్ సాజీద్, సిబ్బంది ఉన్నారు.

**పచ్చల నడ్కుడలో ట్యాంకుల పరిశీలన**

వేల్పూర్, ఏప్రిల్ 16 : మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలో తాగునీటి ట్యాంకులను ప్రత్యేకాధికారి, ఎంపీవో సయ్యద్ జువేద్, పంచాయతీ కార్యదర్శి నవనీతతో కలిసి మంగళవారం పరిశీలించారు. ప్రతి ట్యాంకు వద్ద పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు.


వేల్పూర్ మండలం పచ్చలనడ్కుడలో ట్యాంకుల ద్వారా నీటి సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

# నేడు స్వర్ణామృతం పంపిణీ

నందిపేట్, ఏప్రిల్ 16: నందిపేట్ మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమం పలుగుట్టపై బుధవారం పిల్లలకు స్వర్ణామృతం పంపిణీ చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రతినెల పుష్యమి నక్షత్రం పురస్కరించుకుని స్వర్ణామృతం పంపిణీ చేపట్టనున్నారు. 15 ఏండ్లలోపు పిల్లలందరికీ స్వర్ణామృతం అందజేయనున్నారు. తల్లిదండ్రులు ఉదయమే ఆశ్రమానికి చేరుకోవాలని నిర్వాహకులు సూచించారు.

## గోదాములను పంచాయతీకి అప్పగించాలి

ఎడపల్లి, ఏప్రిల్ 16: మండలంలోని మంగళ్ పాడ్‌లో పంచాయతీ ప్రత్యేక అధికారి సందీప్ అధ్యక్షతన మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో గతంలో రూర్బన్ పథకంలో భాగంగా గోదాములు నిర్మించారు. సొసైటీ అభ్యర్థిన మేరకు సొసైటీకి గోదామును అప్పగించాలని కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిని వ్యతిరేకించిన గ్రామస్తులు గోదామును పంచాయతీకి అప్పగించాలని కోరారు. గ్రామ అవసరాలకు ఉపయోగపడుతుందని, సొసైటీకి పాత గోదామును అప్పగించాలని ప్రత్యేకాధికారికి వినతిపత్రం అందజేశారు.

## శ్రీ రామ నవమికి ఏర్పాట్లు పూర్తి

ఆర్మూర్‌టౌన్/నందిపేట్/రుద్రూర్/కోటగిరి, ఏప్రిల్ 16: జిల్లాలో శ్రీరామ నవమి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. ఆర్మూర్‌లోని సిద్ధుల గుట్ట రామాలయంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని అర్చకులు కుమార్ శర్మ, గోపీకృష్ణ కోరారు. నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లో శ్రీరామనవమి వేడుకల కోసం ఆలయాలను ముస్తాబు చేశారు. నందిపేట్‌లోని రాజానగర్, రాంనగర్, ఆంధ్రనగర్, సిద్ధాపూర్, డొంకేశ్వర్‌లోని ఆలయాలను అందంగా అలంకరించారు. రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్‌లో కోదండరామాలయం, లక్ష్మీపూర్ క్యాంపు, రాయకూర్ క్యాంపులోని ఆలయాల్లో వేడుకలకు అన్ని ఏర్పాటు పూర్తిచేసినట్లు పూజారులు తెలిపారు. ఉమ్మడి కోటగిరి మండలంలోని ఎక్లాస్‌పూర్‌క్యాంప్, ఎత్తొండ, పొతంగల్, కల్లూర్, కోటగిరిలోని రామాలయాలను అందంగా ముస్తాబు చేశారు. సాయి బాబా జన్మదిన వేడుకలకు పొతంగల్‌లోని సాయిబాబా మందిరాన్ని అందంగా అలంకరించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## కళాకారుడికి సన్మానం


రచయిత, గాయకుడు రామును సన్మానిస్తున్న గ్రామస్తులు, టీచర్లు

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 16 : మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన రచయిత, గాయకుడు రాము తాను రాసి ఆలపించిన 'అమ్మ పాట'కు విశేష స్పందన వస్తోంది. దీంతో రామును మంగళవారం గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు శాలువాతో ఘనంగా సన్మానించారు. మరిన్ని మంచి పాటలు రాసి గ్రామానికి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామస్తులు హకీమ్, మెట్‌పల్లి సురేందర్, ఉపాధ్యాయులు కనక గంగాధర్, హెచ్‌ఎం, పీటీ గంగాధర్, మధుసూదన్, ధర్మేందర్, రమేశ్‌కుమార్, భాగ్యలక్ష్మి, గంగామణి, శోభ, శైలజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మొక్కలను సంరక్షించాలి

ఏర్గట్ల, ఏప్రిల్ 16: మండలంలోని అన్ని గ్రామాల్లో హరితహారం కింద నాటిన మొక్కలను సంరక్షించాలని జీపీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు ఎంపీవో శివచరణ్ సూచించారు. ప్రస్తుతం హార్వెస్టర్ల ద్వారా యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయని, దీంతో రోడ్డుకు ఆనుకొని ఉన్న, పొలం గట్లపై ఉంటే మొక్కలు, చెట్లకు నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. దీనిపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.